

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 22: వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి ఎంపిక పరీక్షకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ప్రకటనలో కోరారు. ప్రవేశం కోరే అభ్యర్థులు ఉమ్మడి మెదక్ జిల్లాలో చదువుతూ, తల్లిదండ్రుల నివాసం కూడా ఇక్కడే ఉండాలన్నారు. దరఖాస్తుకు సెప్టెంబరు 16చివరి తేదీ అని, ప్రవేశ పరీక్ష 18 జనవరి 2025 (శనివారం) నిర్వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌లో చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు.



భరోసా సెంటర్‌ను పరిశీలిస్తున్న జార్జి జోసెఫ్

సిద్దిపేట భరోసా సెంటర్ భేష్

- రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్ రేంజి జార్జి జోసెఫ్

సిద్దిపేట క్రైం, ఆగస్టు 22: అన్ని భరోసా సెంటర్ల కంటే సిద్దిపేట భరోసా సెంటర్ ఆహ్లాదకరంగా ఉందని రాష్ట్ర భరోసా సెంటర్ ప్రాజెక్టు మేనేజర్ రేంజి జార్జిజోసెఫ్ సిబ్బందిని అభినందించారు. సిద్దిపేట భరోసా సెంటర్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. భరోసా సెంటర్ పరిసర ప్రాంతాలను, సెంటర్‌లో ఉన్న పరికరాలు, పిల్లలు ఆడుకోవడానికి కేటాయించిన వస్తువులు, ఫర్నీచర్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. అవసరమైన ఫర్నీచర్‌ను త్వరలోనే అందజేస్తామన్నారు. సిబ్బందిని కూడా పెంచుతామని తెలిపారు. అనంతరం నమోదవుతున్న కేసుల గురించి తెలుసుకున్నారు. భరోసా సెంటర్‌కు వచ్చే వారి మనోభావాలు దెబ్బతీయకుండా మర్యాదగా మాట్లాడి వారు సమస్యలు పరిష్కరించాలని సూచించారు. వారికి కావాల్సిన న్యాయం అందజేయాలని సిబ్బందికి సూచించారు. ఫోక్సోకేసుల్లో శిక్షల శాతం పెంచాలని సిబ్బందికి సూచించారు. భరోసా సెంటర్ సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆయన వెంట మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, భరోసా సెంటర్ సిబ్బంది, కోఆర్డినేటర్ వినోద, లీగల్ సపోర్ట్ పర్సన్ సౌమ్య, సపోర్ట్ పర్సన్ హరితారెడ్డి, రిసెప్షనిస్ట్ స్వాతి, మహిళా హోంగార్డులు నవనీత, అనూష పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, ఆగస్టు 22 : సైబర్ నేరాల పట్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ అనురాధ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. అజ్ఞాత వ్యక్తులు ఎవరైన పాత మొబైల్స్ లేదా పాడైన మొబైల్స్ కొంటాం అంటూ వస్తే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరస్తులు సైబర్ నేరాల్లో వినియోగించేందుకు పాత మొబైల్ ఫోన్లను అక్రమంగా కొనుగోలు చేస్తున్న ముగ్గురిని సైబర్ సెక్యూరిటీ బ్యూరో రామగుండం పోలీసులు అరెస్టు చేశారని, 4వేల మొబైల్ ఫోన్లు, మూడు బైకులను స్వాధీనం చేసుకున్నారన్నారు. పాత ఫోన్లను గుర్తుతెలియని వ్యక్తులకు విక్రయిస్తే వాటిని సైబర్ మోసాలకు ఉపయోగించే అవకాశం ఉందని, డివైజ్ ఐడెంటిటీ కారణంగా అమ్మకందారులు కూడా నేరాలకు పాల్పడే అవకాశం ఉందని అనుమానిస్తారని ఆమె హెచ్చరించారు. అందువల్ల ప్రజలు తమ పాత ఫోన్లను విక్రయించేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. కేటుగాళ్ల వల్ల ప్రజలు తమ కష్టార్జితం కోల్పోతున్నారని, ప్రజలు తమ పాత మొబైల్ ఫోన్లను గుర్తుతెలియని వ్యక్తులకు అమ్మకూడదని, సైబర్‌మోసాలతో జాగ్రత్త ఉండాలని సూచించారు.

సొంతింటి కల నెరవేరేదెప్పుడో..

- కట్టుకుంటే రూ.5 లక్షలిస్తామన్న సర్కారు..
- జిల్లాలో 2,36,014 'ఇందిరమ్మ' దరఖాస్తులు
- కొందరికి గత ప్రభుత్వహయాంలో ప్రొసీడింగ్ కాపీలు
- ఉన్న ఇల్లు కూల్చుకుని కిరాయి ఇళ్లలో..
- సాయం కోసం లబ్ధిదారుల ఎదురుచూపు



బేస్‌మెంట్, పిల్లర్లస్థాయిలో నిలిచిన ఇంటి నిర్మాణం

సిద్దిపేట రూరల్, ఆగస్టు 22 : పేదల సొంతింటి కల నెరవేరడం లేదు. గత ప్రభుత్వ హయాంలో సొంత స్థలంలో ఇల్లు కట్టుకుంటే రూ. 3లక్షలు ఇస్తామని పేర్కొనడంతో పాటు కొందరికి ప్రొసీడింగ్ ఆర్డర్లను ఇచ్చింది. కొత్త



ఇర్కోడులో ఇల్లు లేకపోవడంతో గుడిసెలో ఉంటున్న కుటుంబం

ప్రభుత్వం రూ.5లక్షలు ఇస్తామని ప్రకటించినా మార్గదర్శకాలు విడుదల చేయకపోవడంతో సాయం ఎప్పుడు అందుతుందోనని జిల్లావ్యాప్తంగా లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

ప్రజాపాలనలో జిల్లావ్యాప్తంగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం 2,36,014 మంది దరఖాస్తులు చేసుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాలకు 250 గజాల ఇంటి స్థలం కోసం 556, తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కోసం 3,775 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీరికి ఇంటి నిర్మాణానికి సరిపడా స్థలం ఉన్నా ఆర్థిక పరిస్థితులు సరిగా లేక ప్రభుత్వం అందించే సాయం కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల నిర్మాణానికి ఒక్కో ఇంటికి రూ.3లక్షల



పిల్లర్ గుంతల స్థాయిలోనే ఆగిపోయిన పనులు

చొప్పున ఇస్తామని ప్రకటించింది. గ్రామీణ ప్రాంతాల్లో కొందరు సొంత స్థలంలో ఇళ్ల నిర్మాణానికి ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. లబ్ధిదారులు ఇంటి పనులు ప్రారంభించి బేస్‌మెంట్, పిల్లర్ల స్థాయి వరకు నిర్మాణ పనులు చేపట్టారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. గత ప్రభుత్వం ఇచ్చిన ప్రొసిడింగ్‌లను రద్దు చేసింది. దీంతో జనవరిలో ఆయా మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట లబ్ధిదారులు ఆందోళనలు చేపట్టి నిరసన తెలిపారు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలలో భాగంగా ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల ఆర్థిక సాయం ప్రకటించింది. అందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించినప్పటికీ మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో ఆర్థిక సహాయం నేటికీ అందక లబ్ధిదారులు నిరాశ చెందుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రొసీడింగ్ కాపీలను అందుకున్న లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను చేపట్టారు. ఉండడానికి ఇల్లు లేక కిరాయి ఇల్లు దొరక్క అవస్థలు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు దృష్టిసారించి ఇంటి నిర్మాణానికి ఇందిరమ్మ పథకం కింద ఆర్థిక సహాయం అందించాలని కోరుతున్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రొసీడింగ్ కాపీలతో నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు(ఫైల్)

ఆర్థిక సహాయం అందించాలి

- బేజగం అఖిల, గుర్రాలగొంది



ఇందిరమ్మ పథకంలో భాగంగా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని సొంత స్థలంలో ఇంటి పనులు మొదలు పెట్టాం. పిల్లర్లను నిర్మించాం. ఆర్థిక పరిస్థితులు సరిగా లేక నిర్మాణాన్ని మధ్యలోనే ఆపేశాం. ఉండేందుకు కిరాయికి ఇల్లు దొరకడం లేదు. ఇంటి నిర్మాణం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలి.

గుడిసెలో ఉంటున్నాం

- చెప్యాల రాజమణి, ఇర్కోడు



ఇల్లు లేకపోవడంతో ఖాళీ స్థలంలో గుడిసె వేసుకుని పిల్లలతో కలిసి ఉంటున్నాం. ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నాం. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇల్లు కట్టుకునేందుకు లిస్టులో పేరు వచ్చింది. ఉన్న కాసిన్ని పైసలతో బెస్‌మెంట్ వరకు కట్టుకున్నాం. ఇందిరమ్మ ఇల్లు కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలి.

గజ్వేల్ గొంతు తడిచేలా!

- ఇప్పటికే పూర్తయిన మంగోల్ డబ్ల్యూటీపీ
- అక్కారంలో చివరి దశలో పంప్‌హౌజ్ పనులు
- రూ.210 కోట్ల వ్యయంతో పెండింగ్ పైప్‌లైన్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్
- పూర్తయితే తీరనున్న నీటిగోస
- టెండర్ దశలో పైప్‌లైన్ పనులు



కుకునూరుపల్లి మండలం మంగోల్ వద్ద నిర్మించిన భారీ నీటిశుద్ధి జలాశయం

గజ్వేల్, ఆగస్టు 22: హైదరాబాద్ మహానగరంతో పాటు యాదాద్రి-భువనగిరి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలతో పాటు గజ్వేల్ సెగ్మెంట్‌కు తాగునీటి అవసరాలు తీర్చేందుకు మల్లన్నసాగర్ రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం మంగోల్‌లో నిర్మించిన డబ్ల్యూటీపీకి అనుసంధానంగా అక్కారం వద్ద పంప్‌హౌజ్‌ను నిర్మించింది. ఈ పంప్‌హౌజ్ ద్వారా రెండు జిల్లాలతో పాటు గజ్వేల్‌సెగ్మెంట్‌కు శాశ్వత తాగునీటి పరిష్కారం లభించనున్నది.

పూర్తయిన తాగునీటి శుద్ధి జలాశయం

కుకునూరుపల్లి మండలం మంగోల్ వద్ద రూ.1212 కోట్ల వ్యయంలో 50 ఎకరాల విస్తీర్ణంలో 540 ఎంఎల్డీ (మిలియన్ లీటర్ పర్ డే) సామర్థ్యం గల భారీ తాగునీటి శుద్ధి జలాశయాన్ని నిర్మించారు. మల్లన్నసాగర్ నుంచి ప్రత్యేక ట్యాపింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేసి మంగోల్ వద్ద నీటిని శుద్ధి చేయనున్నారు. ఏటా 10 టీఎంసీల నీటిని వినియోగించుకునేలా ఈ ట్యాపింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 1.60 టీఎంసీల నీటిని వినియోగించుకుంటుండగా భవిష్యత్ అవసరాల దృష్ట్యా 10 టీఎంసీల నీటిని తీసుకునేలా ఏర్పాట్లు చేశారు. మంగోల్ వద్ద నిర్మించిన తాగునీటి జలాశయం నుంచి ఇప్పటికే జనగామ జిల్లాతో పాటు సూర్యాపేట జిల్లాలోని పలు మున్సిపాలిటీలు, గ్రామాలకు తాగునీటిని అందిస్తున్నారు. తర్వాత మేడ్చల్-మల్కాజ్‌గిరి,యాదాద్రి-భువనగిరి జిల్లాలతో పాటుగా గజ్వేల్ నియోజకవర్గానికి తాగునీటిని శాశ్వతంగా అందించేందుకు కృషి చేయనున్నారు. ఇందుకు పూర్తిస్థాయిలో మల్లన్నసాగర్ రిజర్వాయర్‌పైనే ఆధారపడనున్నారు. గజ్వేల్ మండలం అక్కారం వద్ద నిర్మించిన పంప్‌హౌజ్ పనులు దాదాపుగా పూర్తి కావొచ్చాయి. విద్యుత్ సరఫరాను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తే అక్కారం పంప్‌హౌజ్ పూర్తిస్థాయిలో పూర్తై నీటిని పంపింగ్ చేసేందుకు సిద్ధమవుతుంది.

పైప్‌లైన్ నిర్మాణానికి మొదలైన టెండర్ ప్రక్రియ

ఇప్పటివరకు ఎల్లంపల్లి నుంచి సుజల స్రవంతి ద్వారా హైదరాబాద్ వెళ్లే హెచ్ఎండబ్ల్యూఎస్ పైప్‌లైన్ నుంచి ప్రజ్ఞాపూర్ వద్ద ప్రత్యేక ట్యాపింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేసి గజ్వేల్ మండలం కోమటిబండకు నీటిని తరలించారు. కోమటిబండ గుట్టపై జీఎల్బీఆర్ నిర్మించి గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాలకు తాగునీటిని అందిస్తున్నారు. ప్రస్తుతం హెచ్ఎండబ్ల్యూఎస్‌కు నీటిని వినియోగించుకున్నందుకు గానూ దాదాపుగా రూ.వెయ్యి కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈమొత్తం భారీగా ఉండడంతో హెచ్ఎండబ్ల్యూఎస్‌తో సంబంధం లేకుండా శాశ్వత తాగునీటి పరిష్కారానికి మల్లన్నసాగర్ నుంచి నీటిని తీసి మంగోల్ వద్ద శుద్ధి చేసి పైప్‌లైన్ ద్వారా అక్కారం పంప్‌హౌస్‌కు తరలించి అక్కడి నుంచి కోమడిబండతో పాటు మేడ్చల్-మల్కాజ్‌గిరి, యాదాద్రి-భువనగిరి జిల్లాలకు నీటిని తరలించనున్నారు. మల్లన్నసాగర్ నుంచి అక్కారం వరకు గల పైప్‌లైన్ పనుల్లో 8 కిలోమీటర్లు పెండింగ్‌లో ఉన్నాయి. అక్కారం నుంచి మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట మండలం ఘనపూర్ వరకు వరకు 33.8 కిలోమీటర్లలో 8.5 కిలోమీటర్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పనులతో పాటు మంగోల్ నుంచి అక్కారం వరకు ఎనిమిది కిలోమీటర్ల పైప్‌లైన్‌ను పూర్తిచేసేందుకు ప్రస్తుతం ప్రభుత్వం రూ.210 కోట్లను విడుదల చేసింది ఇందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతుంది. ఈ ప్రక్రియ పూర్తయితే మూడు నుంచి నాలుగు నెలల్లో పూర్తిస్థాయిలో తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది. పైపులైన్ నిర్మాణానికి ఆర్అండ్‌బీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రత్యేకంగా కృషి చేయగా, గతంలో గజ్వేల్ నియోజకవర్గంలో పెండింగ్ పనులు పూర్తవుతాయి.

నాలుగు నెలల్లో పూర్తి చేస్తాం

- ఎస్ఈ రాజయ్య, మిషన్ భగీరథ సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి

కుకునూరుపల్లి మండలం మంగోల్ వద్ద నిర్మించిన భారీ శుద్ధి నీటి జలాశయం నుంచి మేడ్చల్-మల్కాజ్‌గిరి, యాదాద్రి-భువనగిరి, జనగామ జిల్లా, సూర్యాపేట జిల్లాలోని పలు ప్రాంతాలకు తాగునీటిని అందించనున్నాం. ఇప్పటికే గ్రావిటీ ద్వారా జనగామ జిల్లాతో పాటు సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మున్సిపాలిటీ వరకు తాగునీటిని అందిస్తున్నాం. యాదాద్రి, మేడ్చల్ జిల్లాలతో పాటు గజ్వేల్‌కు నీటిని అందించడంలో 16 కిలోమీటర్ల పైప్‌లైన్ పెండింగ్‌లో ఉండగా, ప్రస్తుత ప్రభుత్వం పైప్‌లైన్ నిర్మాణానికి రూ.210 కోట్ల నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం టెండరింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. టెండర్ పూర్తయితే హెచ్ఎండబ్ల్యూఎస్‌తో సంబంధం లేకుండా మూడు నెలల్లో పనులు పూర్తిచేసి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని అందించనున్నాం.

దిగొచ్చిన కోడి

- చికెన్ అమ్మకాలపై శ్రావణమాసం, వర్షాకాలం ఎఫెక్ట్
- సీజనల్ వ్యాధుల వల్ల శాఖాహారం వైపే ప్రజల మొగ్గు
- గతనెలలో కిలో రూ.300 - ఆగస్టులో క్రమంగా తగ్గుముఖం
- ప్రస్తుతం కిలో రూ.170నుంచి 220చొప్పున విక్రయం
- ముహూర్తాల వల్ల మళ్లీ పెరిగే అవకాశం



సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 22 : శ్రావణమాసం, వర్షాకాలం ఎఫెక్ట్ చికెన్‌పై పడింది. దీంతో గతనెలలో కిలో చికెన్ రూ.280 నుంచి రూ.300 వరకు పలికింది. సామాన్యప్రజలు కొన్నిరోజుల పాటు చికెన్ తినడమే మానేశారు. కొందరైతే శుభకార్యాలకు, ఫంక్షన్లకు కూడా వెజ్ భోజనంతో సరిపెట్టారు. ఆగస్టు 5నుంచి శ్రావణమాసం మొదలుకావడంతో చాలామంది నాన్‌వెజ్‌ను దూరం పెట్టారు. దీంతో చికెన్ ధరలు క్రమంగా పడిపోయాయి. ఈనెల మొదట్లో కిలో చికెన్ రూ.170 నుంచి రూ.180 చొప్పున విక్రయించారు. శ్రావణ శుక్రవారాలు, వరలక్ష్మి వ్రతం, రాఖీపౌర్ణమి సమయాల్లో కొన్నిచోట్ల కిలో రూ.150 చొప్పున కూడా విక్రయించారు. ధరలు తగ్గుముఖం పట్టడంతో పూజలు, వ్రతాలతో సంబంధం లేని నాన్‌వెజ్ లవర్స్ చికెన్‌ను లాగించేస్తున్నారు. శ్రావణమాసం వచ్చే నెల 3వ తేదీతో పూర్తవుతుంది. అలాగే పెళ్లిళ్లకు ముహూర్తాలు ఉండడంతో మళ్లీ ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. ఈనెల మొదట్లో తగ్గిన ధరలు ప్రస్తుతం కాస్త పెరిగాయి. గురువారం కిలో చికెన్ రూ.200 నుంచి 220 వరకు విక్రయించారు. వారంలో ఒక్కోరోజు ఒక్కో రేటు చొప్పున అమ్మకాలు కొనసాగిస్తున్నారు. శ్రావణమాసం, వానాకాలం పూర్తయితే మళ్లీ ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. శ్రావణమాసం నేపథ్యంలో రెస్టారెంట్లలోనూ ఎక్కువగా శాకాహారం వైపే మొగ్గుచూపుతున్నారు. ఈ క్రమంలో కూరగాయల రేట్లు కూడా బాగా పెరిగాయి. అదేదారిలో పండ్లకూ విపరీతమైన గిరాకీ పెరిగింది.



గిరాకీ లేక ఖాళీగా కనిపిస్తున్న చికెన్ దుకాణం

వ్యాపారం తగ్గింది

- ఓంకార్ రెడ్డి, చికెన్ వ్యాపారి



ఈ మాసం మొదటి నుంచి హెచ్చుతగ్గులు చూస్తున్నాం. శ్రావణమాసం, వానాకాలం కావడంతో జనాలు రావడం లేదు. రెండు, మూడు రోజుల నుంచి కాస్త పర్వాలేదు. రానున్న రోజుల్లో ముహూర్తాలు ఉండడంతో మళ్లీ రేట్లు పెరిగే అవకాశం ఉంది.

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం

- పూర్తిస్థాయిలో రుణమాఫీ అమలు చేసే వరకు పోరాడుతాం : బీఆర్ఎస్
- బీఆర్ఎస్ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు
- పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు రైతులు

8 లో



చిన్నకోడూరులో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

చీరే పంటకు రక్ష!



ప్రకృతి వైపరీత్యాలతో అన్నదాతలు అవస్థలు పడుతుంటే.. మరోవైపు అడవి పందులు రైతుల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అడవి పందులు రాత్రివేళలో గుంపులు గుంపులుగా మొక్కజొన్న, వరి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. వాటి నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు ఇలా చీరలు కట్టి రక్షణ వలయంగా ఏర్పాటు చేసుకుంటున్నారు. అడవిపందుల వల్ల పంట నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. అడవిపందులు పంటలను ధ్వంసం చేస్తే రైతులు వ్యవసాయ శాఖ అధికారులతో పంచనామా చేయించి ఫారెస్ట్ అధికారులకు అప్పగిస్తే రైతులకు నష్టపరిహారం అందుతుందని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు సూచిస్తున్నారు.

- చిన్నకోడూరు, ఆగస్టు 22

రాష్ట్రకూటుల కాలం నాటి

వీరగల్లు లభ్యం

హైదరాబాద్‌సిటీ/ నంగునూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అప్పలాయచెరువు గ్రామంలో రాష్ట్రకూటుల కాలం నాటి వీరగల్లు లభ్యమైందని ఔత్సాహిక చరిత్ర పరిశోధకుడు, కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. ఈ వీరగల్లులో ప్రధాన వీరుడు గుర్రంపై కూర్చుని వంపు కత్తి ధరించి ఉన్నాడని చెప్పారు. అతనికి నడి నెత్తిన కొప్పు కత్తి ఉందని, రాష్ట్రకూటుల కాలం నాటి వీరగల్లు అనడానికి ఇదే ఆధారమని తెలిపారు. తెలంగాణ చారిత్రక ఆనవాళ్లను పరిరక్షించి భవిష్యత్తు తరాలకు తెలిసేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ కోరారు. మరోవైపు నల్లగొండ జిల్లా గుండ్లపల్లి మండలం రహమంతాపూర్ గ్రామ శివారులో రామేశ్వర గుట్టపై క్రీ.పూ వేయేళ్ల నాటి ఇనుప యుగపు కట్టడాలు ఆనవాళ్ళు కోల్పోతున్నాయని పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికుల సమాచారంతో ఇనుప యుగపు సమాధుల (డాల్మన్ల)ను పరిశీలించిన ఆయన.. క్వారీ పనుల్లో కొన్ని ధ్వంసం అయ్యాయని, మిగిలిన ఒకే ఒక కట్టడం ప్రమాదపుటంచున ఉందని చెప్పారు. మూడు వేల ఏళ్లనాటి ప్రజల సామూహిక శ్రమకు, నిర్మాణ నైపుణ్యానికి నిదర్శనంగా ఉన్న దానిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని శివనాగిరెడ్డి స్పష్టం చేశారు.



నంగునూరు మండలం అప్పలాయచెరువులో లభ్యమైన వీరగల్లు రాతి విగ్రహం

సన్మానం.. వెల్దుర్తి, ఆగస్టు 22: ఇటీవల వెల్దుర్తి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన కృష్ణను గురువారం తహసీల్దార్ కార్యాలయంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఆంజనేయులు, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్ తదితరులు ఘనంగా సన్మానించారు.

ప్రతి ఒక్కరూ సేవా బావాన్ని కలిగిఉండాలి

మిరుదొడ్డి, ఆగస్టు 22 : ప్రతిఒక్కరూ సేవాభావాన్ని కలిగిఉండాలని నైపుణ్య ఆర్గనైజేషన్ ఎక్స్‌కూటివ్ డైరెక్టర్ తోట కమలాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మిరుదొడ్డిలో నైపుణ్య ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో క్రీర్తిశేషులు ఏజీ సురేందర్‌రెడ్డి కుటుంబసభ్యుల సౌజన్యంలో జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆర్గనైజేషన్ సభ్యులు ఐలయ్య, రమేష్, బీఆర్ఎస్ నాయకులు మల్లయ్య, స్వామి, రాజు తదితరులున్నారు.



విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేసిన సంస్థ సభ్యులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ధర్నా

తూప్రాన్, ఆగస్టు 22: పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ గురువారం ఆందోళన చేపట్టింది. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీగా తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయం వరకు వెళ్లి ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో కార్యాలయంలోని అధికారికి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కార్తీక్, జిల్లా నాయకులు జగన్, ప్రవీన్, ఆంజి, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ న్యాయవాదిగా ప్రభుదాన్యం

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 22 : ప్రభుత్వ న్యాయవాదిగా సంగారెడ్డి పట్టణానికి చెందిన ప్రభుదాన్యం నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీ చంద్రను కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుదాన్యం మాట్లాడుతూ జిల్లాకు సంబంధించిన కేసుల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనపై ఎంతో నమ్మకంతో ప్రభుత్వం ఇచ్చిన ఈ పదవికి న్యాయం చేస్తానని చెప్పారు.



జిల్లా ప్రధాన న్యాయాధికారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రభుదాన్యం

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి


మండేపల్లి రాజు(ఫైల్)

సిద్దిపేట రూరల్, ఆగస్టు 22 : ప్రమాదవశాత్తు ట్రాక్టర్ టైర్ కింద పడి డ్రైవర్ మృతిచెందిన సంఘటన గురువారం నారాయణరావుపేట మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. సిద్దిపేట రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మండేపల్లి రాజు(46) వృత్తి రీత్యా ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఉదయం పొలం దున్నేందుకు ట్రాక్టర్‌పై వెళ్లాడు. పొలం వద్ద ట్రాక్టర్ పక్కన నిలబడి స్టాట్ చేయగా గేర్‌లో ఉండడంతో ముందుకు వెళ్లగా దాని వెనుక పెద్ద టైర్ కింద పడి రాజు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. ప్రమాదం జరిగిన స్థలాన్ని సిద్దిపేట రూరల్ ఎస్‌ఐ గూడ అపూర్వరెడ్డి పరిశీలించి జరిగిన తీరును తెలుసుకున్నారు. రాజు కుమారుడు మండేపల్లి భగవాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో పడి యువకుడి మృతి

మిరుదొడ్డి, ఆగస్టు 22 : ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతిచెందిన సంఘటన గురువారం మండలంలోని మల్లుపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. మిరుదొడ్డి ఎస్‌ఐ పర్శరాములు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బంజర్ల నవీన్(27) చౌదరిచెరువుకట్టపై మద్యం తాగాడు. ఈ క్రమంలో మూత్రవిసర్జనకు కట్ట కిందకు దిగగా ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. స్థానికులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అక్కడి చేరుకున్న పోలీసులు చెరువులో నుంచి మృతదేహాన్ని బయటకు తీయించారు. రాజుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ముగ్గురు కుటుంబసభ్యులకు గాయాలు


ఐలవ్వ మృతదేహం

చేర్యాల, ఆగస్టు 22 : తెగిపోయిన సర్వీస్ వైర్‌ను సరిచేసుకోకపోవడంతో చిన్నపాటి నిర్లక్ష్యంతో విద్యుత్‌షాక్‌కు గురై కళ్లముందే కన్నతల్లి ప్రాణం కోల్పోగా, ముగ్గురు కుటుంబసభ్యులు గాయాలపాలైన సంఘటన గురువారం చేర్యాల మండలంలో చోటుచేసుకున్నది. ముస్త్యాల గ్రామానికి చెందిన బైర ఐలవ్వ(59) ఇంటి ఆవరణలోని విద్యుత్ మీటర్ సర్వీస్ వైర్‌ను రేకులకప్పు మీదుగా ఏర్పాటు చేశారు. ఇటీవల విద్యుత్ సర్వీస్ వైర్ తెగడంతో దానికి వస్త్రాన్ని చుట్టారు. అయితే గాలులకు వైర్ తెగి రేకుల కప్పుకు తాకిన విషయాన్ని గమనించ లేదు. గురువారం తమ వ్యవసాయబావి వద్ద దుస్తులు ఉతికి ఇంటికి తీసుకువచ్చిన అనంతరం ఐలవ్వ అల్యూమినీయం తీగపై ఆరబెట్టుతుండగా షాక్‌కు గురై మృతిచెందింది. ఆమెను కాపాడబోయిన కుమారుడు అనిల్, కోడలు రమ్య, కూతురు శ్యామల షాక్‌కు గురై అరిచారు. గమనించిన చుట్టుపక్కలవారు వైరును తొలగించడంతో ముగ్గురు ప్రాణాలతో బయటపడ్డారు. అందరినీ చికిత్స నిమిత్తం చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, ఐలవ్వ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

పాము కాటుతో రైతు మృతి

కంగ్టి, ఆగస్టు 22 : పాము కాటుకు గురై రైతు మృతిచెందిన ఘటన బుధవారం రాత్రి సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల పరిధిలోని జంగి.కె గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కోటగిరి సంతోష్ తన భార్య కవితతో కలిసి కుటుంబ పోషణ నిమిత్తం కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. వ్యవసాయ పనుల కోసం పదిహేను రోజుల క్రితమే వారు గ్రామానికి వచ్చారు. తన వ్యవసాయ భూమిలో బోరు వేసి పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేశాడు. బుధవారం పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన సంతోష్ రాత్రి పొలం వద్ద ఉన్న గుడిసేలోనే నిద్రించాడు. దీంతో పాము కాటు వేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. భర్త ఇంటికి రాకపోవడంతో గురువారం ఉదయం భార్య పొలానికి వెళ్లి చూడగా సంతోష్ మృతిచెంది కనిపించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో బాలిక ఆత్మహత్య

పాపన్నపేట, ఆగస్టు 21 : మనస్తాపంతో ఓ బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాపన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం మేరకు.. టేక్మాల్ మండలం బోడగట్టుకు చెందిన మల్లేశం భార్య తొమ్మిది నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి కూతురు కందిపల్లి చందు(14) తల్లి గురించి బాధపడుతుండేది. మనస్తాపం చెందిన చందు బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. గురువారం కుటుంబసభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఆమె తండ్రి మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలపారు.

కాలుష్య జలాలకు బలైన మరో నాలుగు గేదెలు

జిన్నారం మండలంలో తొమ్మిదికి చేరిన గేదెల మృతి


గేదెల మృతదేహాలు

జిన్నారం, ఆగస్టు 22 : గడ్డపోతారం పంచాయతీ కిష్టాయ్యపల్లిలో కాలుష్య జలాలు తాగి మరో నాలుగు పాడి గేదెలు మృతి చెందాయి. కిష్టాయ్యపల్లి గ్రామానికి చెందిన రైతు సాయికుమార్‌కు చెందిన ఐదు పాడి గేదెలు రెండు రోజులుగా మరణించగా.. గురువారం ఉదయం మరో నాలుగు మృత్యువాత పడ్డాయి. ఇటీవల గ్రామ శివారులో పరిశ్రమల నుంచి వదిలని రసాయన జలాలు తాగిన ఘటనలో బాధిత రైతుకు చెందిన తొమ్మిది పాడి గేదెలు మృతిచెందాయి. పరిశ్రమల కాలుష్యం తీరుపై బాధిత కుటుంబం, స్థానిక నాయకులు పీసీబీ కేంద్ర కార్యాలయం వద్ద ఆందోళన కూడా నిర్వహించారు. కాగా ఘటన స్థలాన్ని జిల్లా పశు సంవర్ధక శాఖ, పీసీబీ అధికారులు సందర్శించి, దర్యాప్తు చేపట్టారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానిక నాయకులు డిమాండ్ చేశారు.

నకిలీ మద్యం పట్టివేత

జహీరాబాద్, ఆగస్టు 22 : అక్రమంగా తరలిస్తున్న 44 బాటిళ్ల డిఫెన్స్ నకిలీ మద్యాన్ని గురువారం రాత్రి మండలంలోని కొత్తూరు(బి) గ్రామం వద్ద ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని బీదర్ నుంచి హైదరాబాద్‌కు డిఫెన్స్ మద్యాన్ని తక్కువ ధరకు సరఫరా చేస్తానని అభిషేక్‌పండ్రే కొందరితో ఒప్పందం కుదుర్చుకున్నాడు. గురువారం బీదర్ నుంచి నగరానికి కారులో తరలిస్తున్న క్రమంలో నమ్మదగ్గ సమాచారం మేరకు మండలంలోని కొత్తూర్(బి) వద్ద మాటువేసి నిందితుడిని పట్టుకున్నారు. కారును, 44 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కారు, మద్యం విలువ సుమారు రూ.7.30 లక్షల వరకు ఉంటుందని సీఐ తెలిపారు.

ముందస్తు నోటీసు ఇవ్వకుండా సస్పెన్షన్ సరికాదు

- ఉపాధ్యాయులను విధుల్లోకి తీసుకోవాలి
- డీఈవోకు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక వినతి

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 22 : జిల్లాలో చిన్న చిన్న కారణాలతో ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం సరికాదని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక అభిప్రాయపడింది. గురువారం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో డీఈవో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మదన్‌గోపాల్, సాబేర్‌అలీలు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఏదైనా పొరపాటు చేసినపుడు మెమో ఇచ్చి వివరణ తీసుకోవాలని, సంతృప్తి చెందకపోతే అప్పుడు సస్పెండ్ చేయాలే తప్ప ముందుస్తు నోటీసు లేకుండా చర్యలు తీసుకోవడం మంచి పద్ధతి కాదని హితవుపలికారు. ఇటీవలి కాలంలో విధుల నుంచి తొలగించిన ఉపాధ్యాయులను వెంటనే విధులకు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంచందర్, ప్రభాకర్, అడివప్ప, బాలయ్య, దుర్గయ్య, సాయిలు, శ్రీనివాస్, కంమ్రోదిన్ తదితరులు ఉన్నారు.

డ్రగ్స్ పరిశ్రమ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ

మాసాయిపేట, ఆగస్టు 22 : మాసాయిపేట మండలం పోతనశెట్టిపల్లి శివారులోని ఏర్పాటు చేయనున్న హెపా లైఫ్ డ్రగ్ పరిశ్రమపై పీసీబీ, రెవెన్యూ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో అధికారులు గురువారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి అభిప్రాయ సేకరణ నిర్వహించారు. అయితే పరిసర గ్రామాల్లో అధికారులు చాటింపు చేయకుండానే ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడంపై ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. అధికారులు అతికొద్ది సమయంలోనే ప్రజాభిప్రాయ సేకరణ జరపడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి నిర్వహించాలని ఆయా గ్రామాల ప్రజలు, సంబంధిత అధికారులను కోరారు.


టేక్మాల్-ధనూర రోడ్డు


సంగుపేట రోడ్డు దుస్థితి


పొలాన్ని తలపిస్తున్న అక్కానిపల్లి రోడు


బురదమయంగా పాంపాడ్ రోడ్డు

దారిద్ర్యం

అధ్వానంగా అందోలు నియోజకవర్గ రహదారులు

గుంతలమయంగా నర్సాపూర్ - పటాన్‌చెరు రోడ్డు

మనోహరాబాద్ మండలంలోని కూచారం దారికి గ్రహచారం


గుంతలు, బురదమయంగా పోచారం దారి


ధ్వంసమైన మర్పెల్లి-బిజిలీపూర్ రోడ్డు


మేడికుంది శివారులో చెరువును తలపిస్తూ..


కంకర వేసి వదిలేసిన బుస్సారెడ్డిపల్లి రోడ్డు

అడుగుకో గుంత

జోగిపేట, ఆగస్టు 22 : అడుగుకో గుంత.. అతుకుల బొంత అన్న చందంగా మారింది ఆందోలు నియోజకవర్గంలోని రోడ్ల పరిస్థితి. వర్షాలకు మెజారిటీ రహదారులన్నీ ధ్వంసమయ్యాయి. కంకర తేలి, రోడ్లపైకి మట్టి చేరడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కిలోమీటర్ల మేర బురదమయంగా మారడంతో ప్రయాణికులు నరక యాతన అనుభవిస్తున్నారు. ప్రధాన రహదారుల్లోని పెద్ద పెద్ద గుంతల్లో వర్షపునీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. ఇది గుర్తించని వాహనదారులు అందులో పడి తీవ్ర గాయాలపాలవుతున్నారు. సాక్షాత్తు మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే రోడ్ల దుస్థితి ఇంత అధ్వానంగా తయారైనా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్పందించి వెంటనే మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


కంకర తేలిన ఎల్లుపేట-టేక్మాల్ రోడ్డు


రాయికోడ్-కప్పాడ్ రోడ్డు



గుంతలమయమైన పోచారం-రాయిపల్లి రోడ్డు, కంకరతేలిన మునిపల్లి-సింగూరు రోడ్డు

ప్రమాదకరంగా దారి.. ఆర్టీసీ బస్సు రాకపోకలు బంద్

నర్సాపూర్, ఆగస్టు 22 : నర్సాపూర్ నుంచి పటాన్‌చెరుకు వయా కాగజ్‌మద్దూరు, నత్నాయపల్లి మీదుగా వెళ్లే దారి మెదక్, సంగారెడ్డి రెండు జిల్లాలకు లింకు రోడ్డు. ఈ దారి గుండా పారిశ్రామిక ప్రాంతంతో పాటు హైదరాబాద్ శివారు ప్రాంతాల వారు ఎక్కువగా రాకపోకలు సాగిస్తారు. ఈ ప్రధాన రహదారి పెద్ద పెద్ద గుంతలతో బీటీ అంతా లేచి కంకర తేలి దారుణంగా తయారైంది. ఈ రోడ్డు దుస్థితి బాగ లేక ఆర్టీసీ బస్సులు తరచూ మరమ్మతుకు గురవుతున్నాయని, గుంతల వల్ల ఎక్కడ ఏ ప్రమాదం సంభవిస్తుందోనని బస్సులను నిలిపివేశామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారంటేనే ఈ రోడ్డుపై ప్రయాణం ఎంతో ప్రమాదకరమో అర్థమవుతుంది. గతంలోనే ఈ దారిని రెండు లేన్లుగా విస్తరించేందుకు ప్రతిపాదించారు. రూ.2.67 కోట్లను కేటాయించినప్పటికీ పనులు మాత్రం ప్రారంభించలేదు. కనీసం ఉన్న సింగల్ లేన్ రోడ్డు మరమ్మతులకు నోచుకోవడం లేదు.


నర్సాపూర్ - పటాన్‌చెరు రోడ్డు

సొంత ఖర్చుతో కూచారం రోడ్డుకు మరమ్మతులు

మనోహరాబాద్, ఆగస్టు 22 : మండలంలోని జాతీయరహదారి 44 నుంచి కూచారం గ్రామానికి వెళ్లే 4 కిలోమీటర్ల రోడ్డు బురదమయంగా మారింది. నెల రోజుల క్రితం కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. తాజాగా కురిసిన వర్షాలకు రోడ్డు పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. బురదపేరుకుపోయి అడుగు తీసి అడుగు వేయలేకుండా ఉన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. చేసేదేమీ లేక గ్రామస్థులే రోడ్డు బాగు కోసం నడుంబిగించారు. సొంత ఖర్చులతో బుధవారం ఈ దారికి మరమ్మతులు చేపట్టారు. గతంలోనే రోడ్డు వేసేందుకు ప్రభుత్వం రూ.1.08 కోట్లను మంజూరు చేసింది. కానీ ఇప్పటివరకు నెరవేరలేదు.


ఎక్స్‌కవేటర్‌తో బురద రోడ్డును సరిచేయించుకుంటున్న గ్రామస్థులు

చెరకు రైతుల అభివృద్ధికి కృషి

- ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి
- సీడీసీ చైర్మన్‌గా షాదుల్ ప్రమాణం

కల్హేర్, ఆగస్టు 22 : రాష్ట్ర ప్రభుత్వం చెరకు రైతుల అభివృద్ధికి కృషి చేస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలంలోని మాగి జీఎస్‌ఆర్ షుగర్స్ చెరకు అభివృద్ధి మండలి(సీడీసీ) నూతన చైర్మన్‌గా నియోజకవర్గానికి చెందిన ఎండీ షాదుల్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జీఎస్‌ఆర్ షుగర్స్ పరిధిలోని నారాయణఖేడ్, కామారెడ్డి జిల్లా జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లో ఖేడ్ పరిధిలోనే అత్యధికంగా చెరకు సాగు అవుతుందని అన్నారు. చెరకు రైతులు అధిక దిగుబడి సాధించడానికి ఫ్యాక్టరీ యాజమాన్యాలు కృషి చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా ఇక్కడ రైతులకు తోడ్పాటు అందించాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎకరాకు 50 నుంచి 60 టన్నుల దిగుబడి వస్తుందని మన దగ్గర నూతన పద్ధతులు పాటించి దిగుబడి సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఎండీ షాదుల్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో చైర్మన్‌గా నియమించిన ఎమ్మెల్యేలు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రమాణ స్వీకారం చేసిన షాదుల్‌ను ఎమ్మెల్యే సంజీవరెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, జీఎస్‌ఆర్ షుగర్స్ వైస్ చైర్మన్ వేణుగోపాలరావ్ పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పంచాయతీల నిర్వహణ కష్టంగా మారింది

ప్రభుత్వం వెంటనే నిధులను మంజూరు చేయాలి : కార్యదర్శులు


సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు

మిరుదొడ్డి, ఆగస్టు 22 : గ్రామ పంచాయతీ నిర్వహణకు ప్రభుత్వం వెంటనే నిధులను మంజూరు చేయాలని మిరుదొడ్డి మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు పహీం కోరారు. గురువారం మిరుదొడ్డిలోని 20 గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పంచాయతీల నిర్వహణకు రావాల్సిన నిధులకు మంజూరు చేయకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పు తెచ్చి నిర్వహణ చేస్తున్నామని తెలిపారు. దీంతో తమ కుటుంబపోషణ కష్టంగా మారే అవకాశం ఉందన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో గణేష్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు.

స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులు నిబంధనలు పాటించాలి

27న ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ మేళా : అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృతశ్రీ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 22 : స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులు ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించాలని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృతశ్రీ సూచించారు. సంగారెడ్డిలోని మున్సిపల్ కార్యాలయంలో నేషనల్ అసోసియేషన్ ఆఫ్ స్ట్రీట్ వెండర్స్ ఆఫ్ ఇండియా(ఎన్‌ఏఎస్‌వీఐ)ఆధ్వర్యంలో ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్ శాఖ సౌజన్యంతో నెస్లే వారి సహకారంతో స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులకు శిక్షణ కార్యక్రమం గురువారం కొనసాగింది. వీధి ఆహార వ్యాపారులు వినియోగదారుడితో మెలగాల్సిన తీరుతో పాటు ఫుడ్ సేఫ్టీలో పాటించాల్సిన నిబంధనలు, డ్రెస్‌కోడ్ తదితర అంశాలను వివరించారు. అనంతరం సర్టిఫికెట్లను అందజేశారు. ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లేని వారు ఈ నెల 27వ తేదీన నిర్వహించే లైసెన్స్ మేళాలో పాల్గొని పొందాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అకౌంట్స్ మేనేజర్ కమల్, స్టేట్ కో ఆర్డినేటర్ ప్రసన్న, వసీం, భారతి తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులతో ఫుడ్ సేఫ్టీ అధికారులు

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

- అవగాహనతోనే నియంత్రించడం సాధ్యం
- వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి ఎస్పీ రూపేష్


మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 22 : సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరమని, ప్రజలకు అవగాహన కల్పించడంతోనే నియంత్రించడం సాధ్యమవుతుందని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ జిల్లా పోలీసులను ఆదేశించారు. జిల్లా పోలీసు అధికారులతో గురువారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాలను అరికట్టడానికి అవగాహన ఒక్కటే మార్గమన్నారు. సైబర్ బాధితులు మోసపోయిన డబ్బును బాధితులకు త్వరితగతిన అందే విధంగా చూడాలన్నారు. ఆన్‌లైన్‌లో అపరిచితులతో పరిచయాలకు దూరంగా ఉండాలని, సోషల్ మీడియాల ద్వారా వచ్చే అనుమానిత లింకులను ఓపెన్ చేయొద్దని ప్రజలకు సూచించారు. పోలీసులు, సీబీడీ, ఈడీ అంటూ వచ్చే ఫోన్‌కాల్స్‌కు భయపడొద్దని, ఏ పోలీసు, ఇతర సంస్థలు డబ్బు అడగవన్న విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. సైబర్ బాధితులు కోల్పోయిన డబ్బును త్వరగా బాధితుల ఖాతాల్లో చేరేవిధంగా అన్ని శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాలని పోలీసులకు సూచించారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి : డీఎంహెచ్‌వో

చిన్నశంకరంపేట, ఆగస్టు 22 : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి శ్రీరాం, అన్నారు. మండలంలోని శాలిపేట గ్రామంలో ఓ యువకుడు డెంగ్యూతో బాధపడుతూ మృతిచెందిగా గురువారం మలురియా జిల్లా అధికారి విజయేందర్, పలువురు వైద్యులతో కలిసి ఆయన గ్రామాన్ని సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి పాత కుండీలు, టైర్లు, గుంతల్లో నీటిని తొలగించారు. మండల వైద్యాధికారి సాయిసింధు ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీధుల్లో, మురుగు కాల్వల వద్ద హైపో క్లోరైడ్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. అనంతరం జిల్లా వైద్యాధికారి శ్రీరాం ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో సమీక్షించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు ఉన్నారు.


శాలిపేటలో హైపోక్లోరైడ్ ద్రావణం పిచికారి చేస్తున్న సిబ్బంది

ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం


క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న డీఈవో

నిజాంపేట, ఆగస్టు 22 : నందిగామ గ్రామంలోని గుడ్ షెపర్డ్ స్కూల్‌లో నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలను జిల్లా విద్యాధికారి రాధా కిషన్ గురువారం క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీలు రెండు రోజుల పాటు నిర్వహిస్తారని, మండల స్థాయిలో గెలుపొందిన వారిని జిల్లా, రాష్ట్ర స్థాయిలకు ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నీలకంఠం, నోడల్ అధికారి యాదగిరి, ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానమాల, వందన, రవీందర్, ప్రవీణ్, లింగం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కల్హేర్‌లో


కల్హేర్, ఆగస్టు 22 : కల్హేర్ మండల స్థాయి పాఠశాలల ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్డి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించే ఈ క్రీడల్లో అండర్ 14, అండర్ 17 విభాగాల్లో బాల, బాలికలకు తలపడనున్నారుని పేర్కొన్నారు.

ఎల్లమ్మ గుట్టకు నూతన శోభ

త్రిశూలం, ఢమరుకం ఏర్పాటు తుది దశకు


తయారు చేయించిన ఓంకారంతో కూడిన త్రిశూలం

చేర్యాల, ఆగస్టు 22 : కొమురవెల్లి మల్లన్న ఆలయ ఔన్నత్యాన్ని చాటడంతో పాటు శైవక్షేత్ర ఆనవాలు ప్రతిబింబించేలా ఎల్లమ్మ గుట్టపై త్రిశూలం, ఢమరుకం ఏర్పాటు చేయాలని దేవాదాయశాఖ నిర్ణయించింది. ఈ మేరకు ఆలయ వర్గాలు ఏర్పాటు పనులు వేగవంతం చేశారు. నెలాఖరులోగా అందుబాటులోకి రానుంది. దీంతో ఎల్లమ్మగుట్ట నూతన శోభను సంతరించుకోబోతుంది. మల్లన్నను దర్శించుకునే భక్తులు తన సహోదరి అయిన ఎల్లమ్మను దర్శించుకుని బోనం నివేదించడం ఇక్కడ ఆనవాయితీ. గుట్టపై సూక్‌మానుగుండు, చుక్కల పర్వతం ఉన్నాయి. చుట్టూ పచ్చని పొలాలు, చెరువు, గుట్టలతో కనువిందు చేస్తుండటంతో ఇక్కడి ఆహ్లాదాన్ని భక్తులు ఆస్వాదిస్తుంటారు. ఎల్లమ్మ గుట్టపై త్రిశూలం-ఢమరుకం ఏర్పాటు చేయాలని సంకల్పించి రూ.68లక్షలు నిధులు కేటాయించారు. గతేడాది సెప్టెంబరులో శంకుస్థాపన చేయగా పనులు తుదిదశకు చేరుకున్నాయి. హైదరాబాద్‌లోని ఓ కార్ఖానాలో స్టీల్‌తో త్రిశూలం, ఢమరుకం తయారీ పనులు ఇటీవలే పూర్తిచేయించారు. వారం రోజుల్లోగా హైదరాబాద్ నుంచి వాటిని తీసుకువచ్చి ఈదురుగాలులు, వర్షానికి తట్టుకునేలా బిగింపచేసేందుకు చర్యలు చేపట్టారు. రాజీవ్ రహదారికి అతి సమీపంలో మల్లన్న ఆలయం ఉండటంతో సుదూరం నుంచే రాజగోపురం, గుట్ట కనిపిస్తుంటుంది. ప్రస్తుతం త్రిశూలం, ఢమరుకం కూడా కనిపించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.


ఎల్లమ్మ గుట్ట



గుట్టపై త్రిశూలం ఏర్పాటుకు నిర్మించిన భవనం, సిద్ధం చేసిన గద్దె


చేర్యాలలో చేపట్టిన ధర్నాలో మాట్లాడుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి


సిద్దిపేట టౌన్: ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్


హుస్నాబాద్: ప్లకార్డును ప్రదర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్


దుబ్బాక బస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్ననాయకులు

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం

ప్రభుత్వం రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి పూర్తి స్థాయిలో అమలు చేయకుండా రైతులను మోసం చేసిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. బీఆర్ఎస్ పిలుపు మేరకు గురువారం జిల్లా వ్యాప్తంగా వారు నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా వెంటనే రూ. 2లక్షలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. 30శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయిందని చెప్పారు

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


సిద్దిపేట రూరల్: నారాయణరావుపేటలో నిరసనలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు


నంగునూరు: తహసీల్దార్ సరితకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


చిన్నకోడూరు అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా


అక్కన్నపేటలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వరి వేస్తే ఉరి అన్న వారు ధర్నా చేయడం సిగ్గుచేటు

● డీసీసీ ప్రధాన కార్యదర్శి నాగరాజ్

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 22: తమ ప్రభుత్వ హయాంలో రైతులు వరి వేస్తే ఉరి అన్న బీఆర్ఎస్ నాయకులు రైతుల పేరుతో ధర్నాలంటూ డ్రామాలాడుతున్నారని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజ్‌యాదవ్ మండిపడ్డారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రైతులను పట్టించుకోలేదని, అధికారం పోగానే రైతుల పేరుతో ధర్నాలు చేయడం సిగ్గుచేటుఅన్నారు. కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మీసం నాగరాజ్

డీఏవోగా బాధ్యతల స్వీకరణ

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 22: జిల్లాలోని చేర్యాల ఏడీఏగా విధులు నిర్వర్తిస్తున్న రాధికకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో గురువారం జిల్లా కలెక్టరేట్లోని వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆమె బాధ్యతలను స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం వ్యవసాయశాఖ అధికారులు, డీఏవో కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ మను చౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో పౌర సరఫరాల శాఖ డీఎంగా విధులు నిర్వర్తిస్తున్న ప్రవీణ్‌కుమార్ సిద్దిపేట జిల్లాకు బదిలీపై వచ్చారు. ఈ మేరకు ఆయన జిల్లా కలెక్టరేట్లోని పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మను చౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు.

రాయపోల్‌కు పర్మినెంట్ ఏవో

రాయపోల్, ఆగస్టు 22: రాయపోల్ మండలంలో ఏడాదికి పైగా మండల వ్యవసాయాధికారి పోస్ట్ ఖాళీగానే ఉన్నది. ఇప్పటివరకు గజ్వేల్ ఏవో ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే బుధవారం పలువురు ఏవోలు బదిలీ కావడంతో గజ్వేల్‌కు పీఏటు ఏడీఏగా బదిలీపై వచ్చిన ప్రద్యుమ్నను రాయపోల్ మండలానికి ఇన్‌చార్జిగా నియమించారు. ఆమెను నియమించిన ఒక్కరోజు తేడాలోనే రాయపోల్‌కు పర్మనెంట్ ఏవోగా నరేష్‌ను ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఆయన కామారెడ్డి జిల్లా గాంధారి నుంచి బదిలీపై రాయపోల్‌కు వచ్చి గురువారం బాధ్యతలు చేపట్టారు.

పుస్తెమెట్టెల బహుకరణ

దూళిమిట్ట, ఆగస్టు 22: మండలంలోని జాలపల్లి గ్రామంలో నాగులపల్లి కల్యాణ్‌కుమార్ వివాహం సందర్భంగా తాజా మాజీ జడ్పీటీసీ, టీపీసీసీ కార్యదర్శి గిరి కొండల్‌రెడ్డి పుస్తె మెట్టెలను ఉచితంగా అందించారు. మండల కేంద్రానికి చెందిన గొట్టె శోభ బిక్షపతి కుమార్తె వివాహం సందర్భంగా సామాజిక కార్యకర్త గునుకుల జగన్మోహన్ రెడ్డి పుస్తె మెట్టెలను ఉచితంగా అందించారు.

వీఆర్ఏ కుటుంబాన్ని ఆదుకోవాలి

మద్దూరు, ఆగస్టు 22: అనారోగ్యంతో మృతి చెందిన మండలంలోని ధర్మారం గ్రామ వీఆర్ఏ చిలుముల యాదగిరి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని 61 సంవత్సరాలపై బడిన వారసుల జిల్లా అధ్యక్షుడు గుడుమల్ల రాజలింగం డిమాండ్ చేశారు. గురువారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించా ఈ సందర్భంగా రాజలింగం మాట్లాడారు. విధి నిర్వాహణలో భాగంగా అనారోగ్యంతో మృతి చెందిన వీఆర్ఏ యాదగిరి కుటుంబంలోని ఒకరి ఉద్యోగం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

రుణమాఫీ కాకున్నా విజయోత్సవ ర్యాలీలా?: మల్లారెడ్డి

చేర్యాల, ఆగస్టు 29: రైతాంగానికి పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకున్నా చేర్యాలలో కాంగ్రెస్ నేతలు విజయోత్సవ ర్యాలీ నిర్వహించడం తగదని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏకకాలంలో రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పినా, కనీసం 50శాతంమంది రైతులకు రుణ మాఫీ చేయలేదని, ఎన్నో కొర్రీలపేరిట ఇబ్బందులకు గురి చేస్తూ ప్రభుత్వం వంచిస్తుందన్నారు. చేర్యాలలో జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సంబరాలు జరపడం ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు కొంగరి వెంకట్‌మావో, ఆలేటి యాదగిరి, బద్దిపడిగ కృష్ణారెడ్డి, రాళ్లబండి నాగరాజు, బండకింది అరుణ్‌కుమార్, తాడూరి రవీందర్, దాసరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు

● జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి


ఖాజీపూర్ పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్నడీఈవో

మిరుదొడ్డి, ఆగస్టు 22: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం కూడవెల్లి, అక్బర్‌పేట, బేగంపేట, రుద్రారం, ఖాజీపూర్, జంగపల్లి, రామేశ్వరంపల్లి, చిన్ననిజాంపేట గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో ఏమైనా సమస్యలుంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట ఎంఈవో ప్రభుదాస్, నోడల్ అధికారి అంజయ్య, ఉపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

రుణమాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలి: గజ్వేల్ ఏడీఏ బాబూనాయక్

రాయపోల్, ఆగస్టు 22: ఇప్పటివరకు ప్రభుత్వం రెండు లక్షల లోపు రుణాలు ఉన్న రైతులకు రుణమాఫీ చేసిందని, రెండు లక్షలకు పైగా పంట రుణాలు ఉన్న అర్హులైన రైతులకు త్వరలోనే మాఫీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని గజ్వేల్ ఏడీఏ బాబూనాయక్ పేర్కొన్నారు. రాయపోల్‌లో ఏవోలు నరేష్, ప్రద్యుమ్నలతో కలిసి గురువారం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. అర్హులై ఉండి సాంకేతిక కారణాల వల్ల రుణాలు మాఫీ కాని రైతులు సంబంధిత వ్యవసాయ అధికారులకు పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో ప్రవీణ్ పాల్గొన్నారు.

వైభవంగా సంకష్టహర చతుర్థి

కొండపాక, ఆగస్టు 22: మండలంలోని మర్పడగ శ్రీ విజయ దుర్గా సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో గురువారం సంకష్టహర చతుర్థి వేడుకలను క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభం అయింది. తదనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మోహనకృష్ణశర్మ, వేదవ్యాస శర్మ, లక్ష్మణరావు క్షేత్ర నిర్వహణా కమిటీ సభ్యులు నరసింహ రెడ్డి, శ్రీశైలం, మర్యాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

'మాదకద్రవ్యాలతో అనర్థాలు'

సిద్దిపేట రూరల్, ఆగస్టు 22: మాదకద్రవ్యాల వినియోగం అనేక అనర్థాలకు దారితీస్తుందని, వాటి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిద్దిపేట రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి సూచించారు. నారాయణరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం యాంటీ డ్రగ్స్ కమిటీ ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు చాల మంది బానిసలవుతున్నారని, ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు ఇచ్చే చాక్లెట్, బిస్కెట్ వంటివి తీసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, ఏఎస్ఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ అపూర్వరెడ్డి

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

● ఎంపీడీవో లక్ష్మప్ప

నంగునూరు, ఆగస్టు 22: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంపీడీవో లక్ష్మప్ప సూచించారు. నాటుదాం ఒక చెట్టు - అమ్మ పేరు మీద అనే కార్యక్రమంలో భాగంగా గురువారం నంగునూరు ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి మాట్లాడారు. నాటిన ప్రతీ మొక్కను సంరక్షించేలా బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో ప్రభాకర్‌రావు, పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **మద్దూరు:** అమ్మపేరు మీద చెట్లు నాటుదాం అనే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పంచాయతీ కార్యదర్శి మాదవ్ జాదవ్ సూచించారు. మండలంలోని రేబర్తిలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అమ్మ పేరు మీద ఒక చెట్టు నాటుదాం అనే అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఫీల్డుఅసిస్టెంట్ అయిలయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు జ్యోతి, నిర్మల, అనురాధ, ఏఎన్ఎం మల్‌హోత్రి, ఆశాలు కనకలక్ష్మి, కవిత పాల్గొన్నారు.

● **సిద్దిపేట కల్చరల్:** అందరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి. సునీత సూచించారు. సిద్దిపేట డిగ్రీ కళాశాల ఆవరణలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఔషధ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ అనే పర్యావరణ సంస్థ ఈ మొక్కలను అందించిందన్నారు.


సిద్దిపేట కల్చరల్: మొక్కలతో విద్యార్థులు

'మైనంపల్లి' పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదు

● కాంగ్రెస్ సిద్దిపేట నాయకులు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట టౌన్, ఆగస్టు 22: మైనంపల్లి హనుమంతరావుపై బీఆర్ఎస్ నాయకులు అనుచిత వాఖ్యలు చేయడం తగదని, ఎర్రోళ్ల శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకోవాలని కాంగ్రెస్ సిద్దిపేట నాయకులు సాకి ఆనంద్, బుచ్చిరెడ్డి, కౌన్సిలర్ రియాజుద్దీన్, ఎల్లంలు డిమాండ్ చేశారు. సిద్దిపేట పట్టణంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ.. మైనంపల్లి హనుమంతరావు సిద్దిపేటకు రావడంతో 'సిద్దిపేటలో ఏం పని అంటూ' ఎర్రోళ్ల శ్రీనివాస్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు అధికార హోదాలో ఉన్న ఎర్రోళ్ల శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై దళిత జాతికి ఏం చేశావో చెప్పాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్ రియాజుద్దీన్ మాట్లాడుతూ.. సాంకేతిక కారణాలతో కొందరికి రుణమాఫీ జరగలేదని, త్వరలోనే అందరికీ రుణమాఫీ జరుగుతుందన్నారు. సిద్దిపేట పట్టణంలో నిర్వహించిన ఫుట్‌బాల్ కోర్టులో రూ. 50 లక్షల వరకు అవినీతి జరిగిందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు ఆలకుంట మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావును విమర్శించే స్థాయి లేదు

● బీఆర్ఎస్ ఎస్సీ సెల్ విభాగం నాయకులు


మాట్లాడుతున్న ఎస్సీ సెల్ విభాగం నాయకులు

సిద్దిపేట టౌన్, ఆగస్టు 22: హరీశ్‌రావును విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదని బీఆర్ఎస్ సిద్దిపేట ఎస్సీ సెల్ విభాగం నాయకులు ఉమ్మడి మెదక్ జిల్లా జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ రాగుల సారయ్య, ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బేల్దె రాములు విమర్శించారు. సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ.. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును కొందరు కాంగ్రెస్ నాయకులు విమర్శించడం తగదని ఎద్దేవా చేశారు. రెండు రోజులుగా కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే హరీశ్‌రావు, కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌పై విమర్శలు చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు ప్రజా సమస్యలపై దృష్టిసారించకుండా, విమర్శలు చేయడాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే హరీశ్‌రావుపై విమర్శలు చేస్తే ఊరుకోబోమని, ప్రజలు తిరగబడే రోజులు వస్తాయని హెచ్చరించారు. సమావేశంలో రమేశ్, యాదయ్య తదితరులున్నారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

హుస్నాబాద్, ఆగస్టు 22: హుస్నాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని గురువారం ఛైర్‌పర్సన్ ఆకుల రజిత అధ్యక్షతన నిర్వహించారు. పలు అభివృద్ధి పనులకు తీర్మానాలు చేశారు. పట్టణంలోని వైకుంఠధామం వద్ద విద్యుత్ దీపాలు, స్తంభాల ఏర్పాటుకు రూ. 15 లక్షలు, పారిశుధ్య కార్మికుల దుస్తులు, నూనె, సబ్బులకు రూ. 4లక్షలు, వాహనాల రిపేర్, ఇన్సూరెన్స్ వంటి 25 అంశాలపై తీర్మాణాలు చేశారు. సమావేశంలో కమిషనర్ మలికార్జున్, వైస్ ఛైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు పెరుక భాగ్యరెడ్డి, చిత్తారి పద్మ, దొడ్డి శ్రీనివాస్, కొంకటి నళిని దేవి, రమాదేవి, కోమటి స్వర్ణలత, వాల సుప్రజ, వల్లపు రాజు, గోవిందు రవి, హరీశ్, సరోజన తదితరులున్నారు.

వరదనీటితో తప్పని తిప్పలు


వరద నీటిలో ద్విచక్రవాహనదారుడి ఇక్కట్లు

చేర్యాల, ఆగస్టు 22: చేర్యాల ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఆది ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో వరదనీరు నిలిచి కుంటను తలపిస్తున్నది. దీంతో ప్రజలు, భక్తులు ఇబ్బందులుపడుతున్నారు. రోడ్డువిస్తరణలో భాగంగా బస్టాండు ఆవరణలోని మూలమలుపు వద్ద ప్రదేశం ఎత్తుగా ఉండడం, డ్రైన్ కాలువ నిర్మాణం చేపట్టకపోవడంతో సమీప ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండి దోమలకు ఆవాసంగా మారుతున్నది.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 22: హుస్నాబాద్ గ్రంథాలయానికి హన్మకొండ ఎస్‌వీటీ ప్రొఫెసర్ కోల ఆనంద్‌కిషోర్ గురువారం పుస్తకాలను అందజేశారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలనూ అందిస్తామన్నారు. కార్యక్రమంలో జేఏసీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వీరన్నయాదవ్, మల్లేశం, తిరుపతి, లక్ష్మన్‌గౌడ్, వీరసోమయ్య, లావణ్య తదితరులున్నారు.

'విద్యా సామర్థ్యాలను పెంపొందించాలి'

సిద్దిపేట రూరల్,ఆగస్టు 22: విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను పెంపొందించడానికి కృషి చేయాలని నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు డి.శోభారాణి అన్నారు. కాంప్లెక్స్ పరిధిలోని పలు ప్రాథమిక పాఠశాలలను గురువారం పరిశీలించారు. పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ అమలును, రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

'పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి'

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 22: సీజనల్‌గా వ్యాధుల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మాతా శిశు ఆరోగ్య జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆనంద్ సూచించారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు గురువారం హుస్నాబాద్ మండలంలోని మీర్జాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, మహ్మదాపూర్‌లోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించారు. ప్రతీ రోజు ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వర సర్వే జరపాలని ఆదేశించారు. జ్వరాలబారిన పడిన వారిని తప్పని సరిగా పీహెచ్‌సీలో పరీక్షలు చేయించాలన్నారు. తగిన సమయంలో తగు చికిత్స అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

పీఆర్టీయూ మండల కమిటీ ఎన్నిక

అక్కన్నపేట, ఆగస్టు 22: పీఆర్టీయూ అక్కన్నపేట మండల అధ్యక్షుడిగా కట్కూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న తిప్పర్తి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న గుగులోతు మల్లేశంను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి పంజా రాజమల్లు తెలిపారు. గురువారం నిర్వహించిన ఎన్నికల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అసోసియేట్ అధ్యక్షుడిగా కొమురయ్య, ఉపాధ్యక్షులుగా పోగుల రమేష్, వినీత, కార్యదర్శులుగా వసంత, రాజేందర్‌లు ఎన్నికయ్యారు.

కోహెడ మండల ముదిరాజ్ సంఘం..


ఎన్నికైన మండల ముదిరాజ్ సంఘం సభ్యులు

కోహెడ, ఆగస్టు, 22: మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో మండల ముదిరాజ్ సంఘం సభ్యుల సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో కోహెడ మండల ముదిరాజ్ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చామంతుల రాజమల్లయ్య, ఉపాధ్యక్షులుగా పండుగ మల్లయ్య, పిట్టల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా జడగల సతీష్, సహాయ కార్యదర్శిగా తేలు యాదగిరి, కార్యదర్శులుగా కొత్తూరు రాజేందర్, కోనవేని కిషన్, తాడెం శంకర్, సంయుక్త కార్యదర్శులుగా దొంతర వేణి ఆంజనేయులు, కోతి ఉదయ్‌భాస్కర్, అట్ల లక్ష్మణ్, కోశాధికారిగా రంగరవేని వెంకటస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నిలిపి ఉంచిన లారీని ఢీకొట్టి ద్విచక్రవాహనదారుడి మృతి

చిన్నకోడూరు, ఆగస్టు 22: ఆగి ఉన్న లారీని వెనక నుంచి ఢీకొట్టి ద్విచక్రవాహనదారుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని రామునిపట్ల శివారులో రాజీవ్ రహదారిపై గురువారం రాత్రి చోటుచేసుకున్నది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కోహెడ మండలం శనిగరం గ్రామానికి చెందిన కావేరి జనార్దన్ (42) టైలర్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతడు గురువారం పని నిమిత్తం ద్విచక్రవాహనంపై సిద్దిపేటకు వచ్చి రాత్రి తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రామునిపట్ల గ్రామ శివారులోకి రాగానే రాజీవ్ రహదారి పక్కన నిలిపి ఉంచిన లారీని వెనక నుంచి ఢీకొట్టాడు. దీంతో అతడి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహన్ని ఓ ప్రైవేట్ వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య విజయ, కూతురు, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

కారును ఢీకొట్టిన లారీ.. ఇద్దరికి గాయాలు

కొండపాక,ఆగస్టు 22: కారును లారీ ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని తిమ్మారెడ్డిపల్లి శివారులో రాజీవ్‌రహదారిపై గురువారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన శ్రీధర్(28), స్వప్న(25) భార్యాభర్తలు కారులో హైదరాబాద్ వెళ్తున్నారు. ఈ క్రమంలో తిమ్మారెడ్డిపల్లి శివారులో హైదరాబాద్ నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న లారీ యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో కారును ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న శ్రీధర్, స్వప్నలకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కొండపాక 108 సిబ్బంది మెడికల్ టెక్నీషియన్ మహేందర్,పైలట్ శ్రీనివాస్ అక్కడికి చేరుకుని గాయపడిన వారికి ప్రాథమిక చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తిని ఢీకొట్టి పారిపోయిన కారు డ్రైవర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు


ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను, కారును చూపుతున్న పోలీసులు

వర్గల్, ఆగస్టు 22: మండలంలోని గౌరారం రాజీవ్ రహదారిపై రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొట్టి ఆపకుండా వెళ్లిన కారును గురువారం గౌరారం పోలీసులు గుర్తించారు. కారుతో పాటు డ్రైవర్‌ను మీడియా ముందు ప్రవేశపెట్టారు. సంఘటనకు సంబంధించి గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం తెల్లవారుజామున గౌరారం రాజీవ్ రహదారిపై ఓ రెస్టారెంట్ సమీపంలో గజ్వేల్ పట్టణానికి చెందిన చిక్కుడు కిరన్ రోడ్డు దాటుతున్నాడు. అతడిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందినట్లు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. రోడ్డు ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించడం కోసం సిద్దిపేట, ప్రజ్ఞాపూర్, గౌరారం, అలియాబాద్ చౌరస్తా, ఓఆర్ఆర్ టోల్‌గేట్ వద్ద ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించి, ప్రమాదానికి కారణమైన కారును, ములుగు మండలం ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన డ్రైవర్ రవికిరణ్‌ను అదుపులోకి తీసుకుని అతనిపై కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన కారును, డ్రైవర్‌ను 12 గంటల్లో పట్టుకున్న ఎస్ఐ కరుణాకర్‌రెడ్డిని, పోలీస్ సిబ్బందిని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ఉన్నతాధికారులు అభినందించారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

నంగునూరు, ఆగస్టు 22: నంగునూరు పెద్దవాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులపై గురువారం కేసు నమోదు చేసి రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు రాజగోపాల్ పేట ఎస్ఐ ఆసిఫ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా నంగునూరు గ్రామానికి చెందిన కోల ప్రభాకర్, బద్దుల యాదగిరి అనే వ్యక్తులు రెండు ట్రాక్టర్లలో అనుమతి లేకుండా పెద్దవాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసిన్నట్లు తెలిపారు.

కేజీబీవీ సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి


కేజీబీవీలో సభ్యత్వ నమోదు చేస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

జగదేవ్‌పూర్, ఆగస్టు 22: కేజీబీవీ పాఠశాలల్లోని సమస్యలను, ఆదర్శ పాఠశాలల్లో బదిలీల కోసం కృషి చేస్తామని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. జగదేవ్‌పూర్‌లో గురువారం నిర్వహించిన పీఆర్టీయూ సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలన్నీ పీఆర్టీయూతోనే పరిష్కారమవుతాయని అన్నారు. త్వరలోనే ఉపాధ్యాయులకు మూడు డీఏలు ఇవ్వడానికి సీఎం అంగీకరించారని, మెరుగైన పీఆర్సీ కోసం పీర్టీయూ కృషి చేస్తున్నందని చెప్పారు. ఆదర్శ పాఠశాలల్లో బదిలీలకు వారం పది రోజుల్లో షెడ్యూల్ విడుదలవుతుందన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయు సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ, జగదేవ్‌పూర్ మండల అధ్యక్ష కార్యదర్శులు వెంకటరామిరెడ్డి, రాత్లవత్ బొద్దు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పి. రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సుదీర్ఘ పోరాటం తర్వాత అనుకూల తీర్పు'

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 22: ఎస్సీ వర్గీకరణపై మందకృష్ణ మాదిగ నేతృత్వంలో 30 సంవత్సరాలు సుదీర్ఘ పోరాటం తర్వాత సుప్రీంకోర్టు అనుకూల తీర్పునిచ్చిందని ఎమ్మార్పీఎస్ నేత లింగంపల్లి శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు దాదాపు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి అన్నారు. ఈ వర్గీకరణ ఎవరి హక్కులను, రిజర్వేషన్లను తీసివేసేది కాదని, తమకు రావాల్సిన న్యాయమైన వాటాను మాత్రమే తాము కోరుకున్నామని తెలిపారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా బంద్ నిర్వహిస్తే వర్గీకరణ వ్యతిరేక శక్తులకు ఎన్ని పార్టీలు మద్దతు తెలిపాయో ఆత్మ విమర్శన చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పెర్క పరశురామ్, సీనియర్ నేత యాదగిరి, ప్రకాష్, లక్ష్మణ్, మల్లేశం, పవన్‌కల్యాణ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

'కుల బహిష్కరణ చేయడం హేయమైన చర్య'

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 22: అక్బర్‌పేట మండలం బొప్పాపూర్‌లో దళిత సామాజిక వర్గానికి చెందిన బండమీది సాయిలు కుటుంబాన్ని కుల బహిష్కరణ చేయడం హేయమైన చర్య అని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బక్కెల్లి బాలకిషన్ పేర్కొన్నారు. సిద్దిపేటలోని కేవీపీఎస్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. వ్యక్తిగత కారణాలతో అదే సామాజిక వర్గానికి చెందిన కొంతమంది కక్ష సాధింపుగా అతడి అంత్యక్రియలకు కుటుంబానికి ఎవరు సహకరించవద్దని హుకుం జారీ చేయడం దుర్మార్గమని అన్నారు. ఇతర గ్రామాల నుంచి వచ్చిన వారు అతడి అంత్యక్రియలకు సహకరిస్తుంటే వారిని కూడా అడ్డుకోవడం అనాగరికతకు చిహ్నమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనం రమేష్, ఎల్లయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

తాటి, ఈత వనాల పెంపుపై మంత్రి ప్రత్యేక దృష్టి

● హుస్నాబాద్ నియోజకవర్గ గౌడ సంఘం చైర్మన్ అనిల్‌గౌడ్

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 22: గౌడ కులస్థులకు ఉపాధిగా ఉపయోగపడే తాటి, ఈత వనాల పెంపుకోసం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేస్తున్నట్లు హుస్నాబాద్ నియోజకవర్గ గౌడ సంఘం చైర్మన్ మార్క అనిల్‌గౌడ్ పేర్కొన్నారు. హుస్నాబాద్ మండలంలోని మహ్మదాపూర్‌లో తాటి, ఈత వనాల పెంపుకోసం అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని గురువారం ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అనిల్‌గౌడ్ మాట్లాడుతూ.. గ్రామీణ ఉపాధి పథకం ద్వారా ప్రభుత్వ స్థలాన్ని చదును చేసి తాటి, ఈత మొక్కల పెంపకం చేపట్టనున్నట్లు తెలిపారు. వారి వెంట ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేశం, మహ్మదాపూర్ గౌడ సంఘం సొసైటీ అధ్యక్షుడు మామిడి తిరుపతి, కొయ్యడ తిరుపతి, దుద్దెడ శంకర్, లింగంగౌడ్ తదితరులు ఉన్నారు.